
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం। 10। నవంబర్। 2024



సోమశిలలో 68.5 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారానికి 68.5 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 5,700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, డెల్టాకు 2,150, ఉత్తరకాలువకు 700, కండలేరుకు 2,600, దక్షిణ కాలువకు 500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.79,770
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,275
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,493
నవర (8 గ్రాములు)	రూ.59,944

గరిష్టం/కనిష్టం
34.0 /25.1

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఆకాశం మేఘావృతంగా ఉండి, అక్కడక్కడ చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. శనివారం గాలిలో తేమ 69 శాతంగా ఉంది.

న్యూస్‌రీల్

రెండో యూనిట్లోనే విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న దామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో రెండో యూనిట్ నుంచి మాత్రమే 480 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోందని ప్రాజెక్ట్ ఇంజినీర్లు శనివారం తెలిపారు. సాంకేతిక కారణాలతో 1, 3వ యూనిట్లలో విద్యుదుత్పత్తి నిలిపివేసినట్లు వెల్లడించారు.

ఆర్టీసీ జోనల్ చైర్మన్‌గా సన్నపురెడ్డి



సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిని సత్కరిస్తున్న కందికట్ల రాజేశ్వరి, ప్రవీణ్

నెల్లూరు రూరల్: ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్‌గా బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిని నియమించారు. దీంతో శనివారం బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, ప్రవీణ్ తదితరులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు.

బేస్‌బాల్ పోటీలకు ముదివర్తిపాళెం విద్యార్థులు



ఇందుకూరుపేట: బేస్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ముదివర్తిపాళెం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం సదానందరావు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడారు. గుంటూరు జిల్లా పత్తిపాడు మండలంలో ఆదివారం నుంచి మంగళవారం వరకు రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించనున్నారని వివరించారు. అండర్ – 17 బాలికల విభాగంలో చష్మిత, చిన్నారి, లావణ్య.. బాలుర విభాగంలో హర్షవర్ధన్, వాసు ఎంపికయ్యారని తెలిపారు. శిక్షణ ఇచ్చిన పీడీ హరయ్యను అభినందించారు.

కార్తీక దీపాలు వెలిగించడం పూర్వజన్మ సుకృతం

- రామానందభారతీస్వామి



భక్తులకు అనుగ్రహభాషణ చేస్తున్న రామానందభారతీస్వామి

నెల్లూరు (బృందావనం): పూర్వజన్మ సుకృతంతోనే కార్తీక దీపాలు వెలిగించగలమని, శివకేశవులను ప్రసన్నం చేసుకునే పవిత్ర మాసం కార్తీకమాసమని విశాఖపట్నం శ్రీసౌభాగ్య భువనేశ్వరి పీఠాధిపతి రామానందభారతీస్వామి అనుగ్రహభాషణ చేశారు. నగరంలోని వీఆర్సీ మైదానంలో కార్తీకమాస లక్ష దీపోత్సవం రెండో రోజు శనివారం రాత్రి రామానందభారతీస్వామి ఆకాశ దీపాన్ని ప్రజ్వలింపజేశారు. కార్తీకమాస లక్షదీపోత్సవ ప్రాంగణానికి విచ్చేసిన రామానందభారతీస్వామికి అర్చకులు పూర్ణకుంభంతో ఆహ్వానించారు. త్రయంబకేశ్వరుడికి అభిషేకం, అయోధ్య బాలరాముడికి లక్ష మల్లెలు, లక్ష తులసీ దళాలతో అర్చనాభిషేకాలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఆధ్యాత్మిక సంకల్పం, పదుగురికి సహాయ పడాలన్న దాతృత్వ స్వభావం కలిగిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ దీపోత్సవం జరగడం సింహపురికి శుభకరమన్నారు. ఉసిరిచెట్టు కింద దీపారాధనతో ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. పాప ప్రాయశ్చితం చేసుకునేందుకు కార్తీకమాసం ఓ సువర్ణ అవకాశమన్నారు. లక్ష దీపోత్సవంలో రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ త్రయంబకేశ్వర్, బాలరాములను దర్శించుకున్నారు. కార్యక్రమ నిర్వాహకులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు మాట్లాడుతూ కార్తీకమాస ఫలాలు ప్రజలందరికి అందాలన్న సంకల్పంతో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామన్నారు.



సేద్యం..సందిగ్ధం

రాళ్లపాడు కింద వరిసాగుపై రైతుల మల్లగుల్లాలు

- ప్రాజెక్ట్ సామర్థ్యం ఒక టీఎంసీ మాత్రమే
- అధికారిక ఆయకట్టు 10 వేల ఎకరాలు
- అనధికారికంగా 30 వేలకు పైగా సాగు
- వైఎస్సార్ హయాంలో సోమశిల నుంచి ఏటా 1.50 టీఎంసీల కేటాయింపు
- ఆరేళ్లుగా ఏనాడు ప్రాజెక్ట్ వరకు కూడా చేరని జలాలు
- ఈ ఏడాది కూడా ఐఏబీలో నీరు కేటాయించినా రావడం సంశయమే

రాళ్లపాడు ప్రాజెక్ట్ కింద ఈ ఏడాది వరి సాగుపై రైతులు మీమాంసలో కొట్టుమిట్టాడుతున్నారు. గత రెండేళ్లుగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో పూర్తిస్థాయిలో సాగు చేయలేకపోయారు. ఈ ఏడాది కూడా అలాంటి పరిస్థితే అనివార్యమవుతోంది. దాదాపు ఆరేళ్ల కాలంలో రెండు.. మూడేళ్ల మాత్రమే ఆయకట్టు సంపూర్ణంగా పండింది. కొన్నేళ్లలో ప్రాజెక్ట్ సామర్థ్యానికి మించి సాగు విస్తీర్ణం రెండింతలు పెరిగింది. ఇందు కోసం సోమశిల నీటిని ఏటా 1.5 టీఎంసీలు విడుదల చేయాలని నిర్ణయించినప్పటికీ ఏటా వంద క్యూసెక్కులు కూడా ప్రాజెక్ట్‌ను చేరిన చరిత్ర లేదు.



రాళ్లపాడు ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం ఉన్న నీరు

కందుకూరు: రాళ్లపాడు ప్రాజెక్ట్ కింద వరుసగా మూడో ఏడాది కూడా పంటలు సాగయ్యే పరిస్థితి లేకుండా పోయింది. ప్రాజెక్ట్‌లో ఆశించిన స్థాయిలో నీటి నిల్వ లేకపోవడమే ఇందుకు కారణం. మరో పక్క సాగునీటి విడుదలపై ప్రాజెక్ట్ అధికారులు ఎటువంటి స్పష్టతను ఇవ్వడం లేదు. దాదాపు ఏడు దశాబ్దాల క్రితం అప్పటి సాగు పరిస్థితులు, నీటి లభ్యతను బట్టి ఒక టీఎంసీ (24 అడుగులు) సామర్థ్యంతో ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించారు. అప్పట్లో అధికారికంగా సుమారు 10 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా, ప్రస్తుతం దాదాపు 30 వేల ఎకరాలకు పైబడి సాగు విస్తీర్ణం పెరిగింది. సాగు పెరిగిన నేపథ్యంలోనే సోమశిల నుంచి రాళ్లపాడుకు ఏటా 1.50 టీఎంసీలు నీటిని విడుదల చేయాలని 18 ఏళ్ల క్రితం దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో కేటాయింపులు జరిగాయి. ఇందు కోసం కాలువ నిర్మాణ పనులను వైఎస్సార్ హయాంలోనే ప్రారంభించినా.. దాదాపు పదేళ్ల తర్వాత కానీ పనులు పూర్తి కాలేదు. కాలువ నిర్మాణంలో జాప్యంతో 2018లో తొలిసారిగా ప్రాజెక్ట్‌ను సోమశిల జలాలు తాకాయి. అయితే అప్పటి నుంచి ఏటా 1.50 టీఎంసీలు నీటిని విడుదల చేస్తున్నప్పటికీ కనీసం 100 క్యూసెక్కులు కూడా ప్రాజెక్ట్‌లోకి చేరని పరిస్థితి నెలకొంది.



రాళ్లపాడు ప్రాజెక్టు కింద సాగు చేసిన నారుమడి

ఊరించి... ఉసూరుమనిపించి..

ఇటీవల అల్పపీడన ప్రభావంతో గత నెలలో విస్తారంగా వర్షాలు కురిశాయి. ఈ వర్షాలపై రైతులు కోటి ఆశలు పెట్టుకున్నాయి. అయితే ఆ వర్షాలకు ప్రాజెక్ట్ నిండుతుందని అందరూ భావించినా 75 శాతం మాత్రమే నీరు వచ్చింది. ప్రాజెక్ట్ పూర్తి సామర్థ్యం 24 అడుగుల కాగా వర్షాలకు కేవలం 17 అడుగుల నీరు మాత్రమే వచ్చింది. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో ఉన్న నీటితో వరిసాగు చేయడం దాదాపు అసాధ్యం. దీంతో ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదలపై అధికారులు ఎటువంటి నిర్ణయం తీసుకోలేకపోతున్నారు.

సోమశిల నీటిపై ఆశలు శూన్యం

రాళ్లపాడు ప్రాజెక్ట్ కింద జిల్లాలోని లింగసముద్రం, వలేటివారిపాళెం, గుడ్లూరు, కొండాపురం మండలాల పరిధిలో అధికారిక, అనధికారిక ఆయకట్టు కలుపుకుని దాదాపు 30 వేల ఎకరాల వరకు ఉంటుందని అంచనా. ఈ మొత్తం ఆయకట్టు సాగు కావాలంటే సుమారు 3 టీఎంసీల నీరు అవసరం పడుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 17.4 అడుగుల నీరు ఉన్నా.. 7 అడుగుల డెడ్ స్టోరేజీ, 2 అడుగులు లీకేజీలు, ఆవిరి రూపంలో ఖర్చు అవుతుందని ప్రాజెక్ట్ అధికారులే చెబుతున్నారు. ఇక 8.4 అడుగులు మాత్రమే ఉంటాయి. ఈ నీటితో నాలుగైదు వేల ఎకరాలు కూడా సంపూర్ణంగా పండే అవకాశం లేదు. ఈ పరిస్థితుల్లో సోమశిల ప్రాజెక్ట్ నుంచి కేటాయించిన 1.5 టీఎంసీల నీటిని తెచ్చుకునే వెసులుబాటు ఉంది. రాళ్లపాడు కోసం నీటిని విడుదల చేసినా ఆ కాలువ ఉండే ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల పరిధిలోని రైతులు మోటార్లు పెట్టి తోడేస్తున్నారు. దీంతో ఆరేడేళ్లలో ఏనాడు కూడా 100 క్యూసెక్కులు కూడా చేరని పరిస్థితి ఏర్పడింది. 15 రోజుల క్రితమే సోమశిల నుంచి రాళ్లపాడుకు ఉత్తర కాలువ ద్వారా విడుదల చేశారు. ఇన్ని రోజుల్లో ఇప్పటి వరకు 30 క్యూసెక్కులు కూడా ప్రాజెక్ట్‌లోకి చేరలేదని అధికారులే చెబుతున్నారు. దీంతో సోమశిల నీటి లభ్యతపై ఆశలు శూన్యంగా మారాయి.

నార్లు పోయడంపై రైతుల సమాలోచనలు

ఈ పరిస్థితుల్లో ఇటీవల నిర్వహించిన ప్రాజెక్ట్ ఆయకట్టు రైతాంగం సమావేశంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. నార్లు పోసుకునేందుకు నీరు విడుదల చేయాలని కొందరు కోరితే, ప్రాజెక్ట్‌లో ఉన్న నీటితో వరి సాగు చేయలేమని కొందరు రైతులు స్పష్టం చేశారు. ప్రధానంగా ప్రాజెక్ట్ ఎగువ గ్రామాలకు చెందిన రైతులు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తుండగా ఆయకట్టు చివరి గ్రామాల రైతులు నీటిని విడుదల చేయొద్దని కోరుతున్నారు. కొందరు ఇప్పటికే బోర్ల కింద నారుమడులు సాగు చేసుకుంటుండగా, మరి కొందరు ప్రాజెక్ట్ నిండినప్పుడు చూద్దాంలే అనే ఆలోచనలో ఉన్నారు. అదే సమయంలో వరి సాగు కంటే పత్తి సాగు వైపు కొందరు రైతులు మొగ్గు చూపుతున్నారు. ప్రధానంగా కౌలు రైతులు పత్తి సాగుకే మొగ్గు చూపుతున్నారు. ప్రాజెక్టు కింద ఒక పంట సాగు చేసుకుంటే ఎకరానికి కౌలు రూ.20 వేల వరకు ఉండగా, రెండు పంటలకైతే రూ.35 వేల వరకు ఉంది. దీంతో కౌలుకు తీసుకునేందుకు రైతులు వెనుకాడుతున్నారు.

నీటి విడుదలపై నిర్ణయం తీసుకోలేదు

ఈ ఏడాది రాళ్లపాడు నీటి విడుదలపై ఇంకా తేదీని నిర్ణయించలేదు. ప్రస్తుతం కాలువల పూడికతీత పనులు జరుగుతున్నాయి. అవి ఇంకా రెండు, మూడు రోజులు పట్టే అవకాశం ఉంది. ఆ పనులు అయిపోయిన తర్వాత ఉన్నతాధికారులు చర్చించి నిర్ణయం తీసుకుంటారు. అదే సమయంలో సోమశిల నుంచి విడుదల అవుతున్న నీటిని 500 నుంచి 700 క్యూసెక్కుల వరకు పెంచారు. ప్రస్తుతం రాజోలు వరకు నీరు వచ్చింది. ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ సోమశిల నుంచి పూర్తిస్థాయిలో నీటిని తెచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నాం. కాలువ పైన ఉన్న ఇబ్బందులతో పూర్తి స్థాయిలో సోమశిల నీరు ప్రాజెక్ట్‌లోకి చేరడం లేదు.

– చంద్రమౌళి, రాళ్లపాడు ప్రాజెక్ట్ జేఈ

ప్రజలపై కూటమి వీరబాదుడు



సీపీఎం ప్రజాపోరుయాత్రలో మాట్లాడుతున్న కత్తి శ్రీనివాసులు

- స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, ట్రూ అప్ చార్జీలు ఉపసంహరించాలి
- ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాలు
- ప్రజాపోరు యాత్రలో సీపీఎం నేతల ధ్వజం

నెల్లూరు (వీఆర్సీసెంటర్): చంద్రబాబు అధికారంలో ఉండగా ఒక విధంగా.. ప్రతిపక్షంలో ఉంటే మరోలా వ్యవహరిస్తున్నాడని సీపీఎం నేతలు ధ్వజమెత్తారు. గత ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే ఎటువంటి చార్జీలు పెంచమని, ముఖ్యంగా విద్యుత్‌పై అదనపు చార్జీలు మోపమని, అవసరమైత 30 శాతం తగ్గిస్తామని హామీలు ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక అన్ని విధాలుగా రాష్ట్ర ప్రజలపై అధిక భారాలను మోపుతూ వీరబాదుడుకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. సీపీఎం ఆధ్వర్యంలో శనివారం ప్రజాసమస్యలపై 'ప్రజాపోరు యాత్ర' కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ సెంటర్ నుంచి ప్రారంభించిన ఈ యాత్ర స్టోన్ హౌస్‌పేట, పప్పులవీధి, శెట్టిగుంటరోడ్డు సెంటర్ మీదుగా సాగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్గ సభ్యులు మోహన్‌రావు, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ నెల్లూరు నగర నియోజకవర్గంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.వేల కోట్లు పేద, మధ్య తరగతి ప్రజలపై భారం మోపుతున్నారని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో 70 శాతం మంది ప్రజలు నివసిస్తున్న ఇళ్లకు స్థలాలకు రిజిస్ట్రేషన్ పట్టాలు లేవని, కుళాయిల ద్వారా కలుషిత నీరు వస్తోందని, స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పెన్నానదికి ఇరువైపులా పొర్లుకట్టలను పటిష్ట పరచాలని కోరారు. నగరంలో రైల్వేట్రాక్‌లు దాటేందుకు అనువుగా ఫ్లై ఓవర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలని, పారిశుధ్యం, డ్రైనేజీ పనులు మెరుగు పరచాలని డిమాండ్ చేశారు. మత విద్వేషాలను రెచ్చగొట్టే మత రాజకీయాలు చేయడం సరికాదని, పవన్‌కళ్యాణ్ సనాతన ధర్మం పేరుతో చేసే రాజకీయాలు సరికాదని హితవు పలికారు. కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ తిరిగి తెరిచి వేలాది మంది యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమలు ఉన్న ప్రాంతాల్లో స్థానికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజాపోరు యాత్ర ప్రతి డివిజన్‌లో కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు, మస్తాన్‌బీ, సూర్యనారాయణ, నగర కమిటీ సభ్యులు నరసింహా, మూలం ప్రసాద్, చెంగయ్య, కత్తి పద్మ, సుబ్బమ్మ, అల్లంపాటి శ్రీనివాసులురెడ్డి, పెంచలయ్య, రషీద్, వేణు, ఏమేలు తదితరులు, పాల్గొన్నారు.

పంట కాలువల్లో పూడికతీత పనులు

- రూ.50 కోట్ల నిధుల మంజూరు
- మంత్రి పొంగూరు నారాయణ



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి నారాయణ

నెల్లూరు (దర్గామిట్ట): సాగునీటి పారుదల కాలువల్లో పూడికతీత పనులకు సంబంధించి రూ.50 కోట్లు నిధులు మంజూరయ్యాయని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ హాల్‌లో కలెక్టర్ ఆనంద్‌తో కలిసి ఇరిగేషన్, విద్యుత్‌శాఖలపై మంత్రి నారాయణ సమీక్షించారు. మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఇరిగేషన్ కాలువల్లో పూడిక తీత పనులు రెండు రోజుల్లో టెండర్లు పూర్తి చేసి ప్రారంభిస్తామన్నారు. పనులు ప్రారంభించే ముందే డ్రోన్ కెమెరాతో వీడియో చిత్రీకరణ, పనులు పూర్తయ్యాక మళ్లీ డ్రోన్ కెమెరాతో చిత్రీకరించాలని సూచించారు. ఈ విధంగా అనవసర ఆరోపణలకు తావు లేకుండా పని చేస్తామన్నారు. ఐఏబీ సమావేశంలో రైతులు సంఘాల నాయకులు రైతులకు విద్యుత్ 7 గంటలు మాత్రమే అందిస్తున్నారని, కొన్ని ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయని తమ దృష్టికి తెచ్చారన్నారు. దీంతో శనివారం జరిగిన సమీక్ష సందర్భంగా మంత్రి నారాయణ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సెక్రటరీ విజయానంద్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఆదివారం నుంచే 9 గంటల విద్యుత్ సరఫరాతో పాటు 200 ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో సోమశిల ఎస్‌ఈ బసిరెడ్డి వెంకటరమణారెడ్డి, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ విజయన్, తెలుగుగంగ ప్రాజెక్ట్ ఎస్‌ఈ వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవినీతిని ప్రశ్నిస్తే అక్రమ కేసులా?

- మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కించపరిచే విధంగా టీడీపీ వింగ్ పోస్టులు
- అయినా పోలీసులు పట్టించుకోవడం లేదు
- నాపై ఇప్పటికే అక్రమంగా నాలుగు కేసులు నమోదు
- వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను వేధిస్తున్న ప్రభుత్వం
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న కాకాణి, చిత్రంలో కిలివేటి, చంద్రశేఖరరెడ్డి తదితరులు

నెల్లూరు (బారకాసు): కూటమి ప్రభుత్వ అసమర్థ పాలనను ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం నెల్లూరులోని తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, పలువురు పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడం దారుణమన్నారు. ఇది కూటమి ప్రభుత్వం కాదని, కిరాతక ప్రభుత్వమన్నారు. రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్య్రాన్ని హరిస్తోందన్నారు. విమర్శించిన, ప్రశ్నించిన ప్రతి ఒక్కరి మీద ఎఫ్‌ఐఆర్ నమోదు చేస్తున్నారన్నారు. ఇప్పటికే తనపైనే పోలీసులు అక్రమంగా నాలుగు కేసులు నమోదు చేశారని, ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. వింజమూరు సోషల్ మీడియా కార్యకర్తపై థర్డ్ డిగ్రీ ఉపయోగిస్తూ రకరకాలుగా హింసిస్తున్నారని చెప్పారు.

వైఎస్ జగన్‌పై పోస్టులు కనబడవా?

సోషల్ మీడియాలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఆయన కుటుంబ సభ్యులను కించపరిచే విధంగా కూటమి పార్టీల వింగ్ పోస్టులు పెడుతుంటే పోలీసులు పట్టించుకోవడంలేదన్నారు. వైఎస్ జగన్ కుటుంబ సభ్యుల మీద నీచాతి నీచంగా పోస్టులు పెడుతుంటే పోలీసులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కొంత మంది పోలీసులు ఖాకీ చొక్కాలు తీసేసి పచ్చ చొక్కాలు వేసుకుని డ్యూటీ చేస్తున్నారని విమర్శించారు. కనుపూరు కాలువ పరిశీలనకు వెళ్లడానికి లేకుండా తనని హౌస్ అరెస్ట్ చేశారన్నారు.

శాంతి భద్రతలు అదుపు తప్పితే ఆ బాధ్యత పోలీసులదే..

వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ఆగ్రహం, ఆవేదనతో ఉన్నారని వారిని రెచ్చగొట్టే ప్రయత్నం చేయొద్దని సూచించారు. శాంతి భద్రతలు అదుపు తప్పితే ఆ బాధ్యత పోలీసులు, ప్రభుత్వానిదేనని చెప్పారు. అధికారం శాశ్వతం కాదని భవిష్యత్‌లో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కాకాణి హెచ్చరించారు. తాము అధికారంలోకి వస్తే ఇబ్బంది పెడుతున్న వారిని ఎట్టి పరిస్థితిలో వదిలే ప్రసక్తే లేదని ఎక్కడ దాక్కున్నా లాక్కొని వస్తామన్నారు. ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందన్నారు. తమ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఇలాగే కొనసాగితే జమిలి ఎన్నికలకు ముందే కూటమి ప్రభుత్వంపై ప్రజలే తిరుగుబాటు చేస్తారన్నారు. సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారన్నారు. ఫొటోలు మార్ఫింగ్ చేసి మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై అసభ్యకరంగా పోస్టులు పెడుతున్నారన్నారు. ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. తమ పార్టీ సోషల్ మీడియా వాళ్లని అన్ని స్టేషన్స్‌కు తిప్పుతూ.. కొడుతున్నారని వీటిని ప్రజలు గమనిస్తున్నారని తెలియజేశారు. ప్రజా తిరుగుబాటు త్వరలోనే మొదలవుతుందన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఏడుగురు ఎంపిక



ఏవీ సుధాకర్



సందానిబేగం

నెల్లూరు (టౌన్): రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు జిల్లా నుంచి సబ్జెక్ట్ టీచర్లు నలుగురు, ఉర్దూ విభాగంలో ముగ్గురు మొత్తం ఏడుగురిని విద్యాశాఖ ఎంపిక చేసింది. ఈ మేరకు శనివారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి. విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. పొదలకూరులోని డీఎన్నార్ జెడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఏవీ సుధాకర్, కొడవలూరు మండలం గండవరం జెడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్ (హిందీ)గా పనిచేస్తున్న గంజి నాగభూషణం, నెల్లూరు రూరల్ మండలంలోని వైఎస్సార్‌నగర్‌లోని ఎంపీపీఎస్‌లో ఎస్జీటీగా పనిచేస్తున్న రామమోహన్, బుచ్చిరెడ్డిపాళెం మండలం రామచంద్రాపురంలోని ఎంపీయూపీఎస్‌లో ఎస్జీటీగా పనిచేస్తున్న గండికోట సుధీర్‌కుమార్ ఉన్నారు. వాస్తవానికి సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఎంపిక చేసి అవార్డులను అందజేయాల్సి ఉంది. విజయవాడలో వరదల కారణంగా ఈ కార్యక్రమాన్ని రద్దు చేశారు. వీరికి ఈ నెల 11న లబ్బీపేటలోని ఏ కన్వెన్షన్ సెంటర్‌లో సీఎం చంద్రబాబు అవార్డులను అందజేయనున్నారు.

ఉర్దూ విభాగంలో...

ఉదయగిరి: జిల్లాలో ముగ్గురు ఉర్దూ టీచర్లను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఉదయగిరిలోని నార్తు ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్జీటీగా (ఉర్దూ టీచర్) పనిచేస్తున్న సందానిబేగం రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. సందానిబేగం 2016 మండల ఉత్తమ అవార్డు, 2024లో జిల్లా స్థాయిలో అవార్డు అందుకున్నారు. ఉదయగిరిలోని బీసీ కాలనీ ఎంపీయూపీ ఉర్దూ పాఠశాలలో ఎస్జీటీగా (ఉర్దూ టీచర్) పనిచేస్తున్న షేక్ సాబియాసుల్తానా బేగం, ఏఎస్‌పేట జెడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్ (ఉర్దూ టీచర్)గా పనిచేస్తున్న షేక్ జిలానీపాషా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

ముగ్గురు ఉత్తమ విద్యార్థులు..

నెల్లూరు (టౌన్): ఆంధ్రప్రదేశ్ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఉర్దూ అకాడమీ జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి ముగ్గురు ఉర్దూ ఉత్తమ ఉపాధ్యాయులతో పాటు ముగ్గురు ఉత్తమ ఉర్దూ విద్యార్థులను కూడా ఎంపిక చేసింది. వీరిలో ఆత్మకూరు జెడ్పీ బాలికల హైస్కూల్ నుంచి షేక్ హలీమా సాదియా, ఉదయగిరి ప్రభుత్వ హైస్కూల్ నుంచి షేక్ సానియా, నెల్లూరు నగరం జెండావీధిలోని పీఎస్ మున్సిపల్ హైస్కూల్ నుంచి షేక్ రౌనాక్ అఫ్రూజ్ ఎంపికయ్యారు. వీరికి ఈ నెల 11న అవార్డులను అందజేయనున్నారు.

రాష్ట్రస్థాయి అవార్డు రావడం సంతోషం



రామమోహన్

నెల్లూరు సిటీ: తనకు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని వైఎస్సార్ నగర్‌లోని ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రామమోహన్ ఆనంద వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆయన డిప్యుటేషన్‌పై కేఎస్‌ఆర్ పాఠశాలలో పనిచేస్తున్నారు. ఉదయగిరి మండలం గంగులవారి చెరువుపల్లికు చెందిన ఆయన 2006లో డీఎస్సీ పూర్తి చేసి 2008లో టీచర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి తాను పనిచేసిన పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడం, విద్యార్థులు డ్రాప్ అవుట్స్‌గా కాకుండా చర్యలు తీసుకునేవారు. కవితలు కూడా రాస్తుంటారు. గత ప్రభుత్వంలో టరల్ (జిల్లా టీచింగ్ ఎట్ రైట్‌లెవల్) జిల్లా నోడల్ ఆఫీసర్‌గా పనిచేశారు. దీక్ష కార్యక్రమానికి జిల్లా కో ఆర్డినేటర్‌గా చేశారు.

కోనేరులో మునిగి వ్యక్తి మృతి

ఉలవపాడు: స్థానిక వేణుగోపాల స్వామి దేవస్థానం కోనేరులో దిగి ప్రమాదవశాత్తు మునిగి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండల కేంద్రమైన ఉలవపాడులో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో మతిస్థిమితం లేని గుర్తుతెలియని వ్యక్తి కోనేరు వద్దకు వచ్చాడు. మెట్ల వద్దే కాసేపు ఉండి నీటిలో దిగేందుకు ప్రయత్నించగా స్థానికులు కేకలు వేశారు. ఇంతలో అతను నీటిలో దిగి మునిగిపోయాడు. సమాచారం అందుకున్న ఎస్సై అంకమ్మ, మన్నేటికోటకు చెందిన ఇద్దరు వ్యక్తులు కోనేరులో దిగి గాలించారు. అరగంట అనంతరం మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. మృతుడి వయసు సుమారు 35 సంవత్సరాలు ఉంటుందని భావిస్తున్నారు. మూడు రోజుల నుంచి ఉలవపాడులో తిరుగుతున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మతిస్థిమితం లేని వ్యక్తి మృతదేహం

వీఎస్‌యూలో త్వరలో డ్రోన్ పైలట్ శిక్షణ


పరిశ్రమల ప్రతినిధులతో చర్చిస్తున్న ఇన్‌చార్జి వీసీ

- ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో త్వరలో డ్రోన్ పైలట్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు పేర్కొన్నారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వర్సిటీలో శనివారం పలు పరిశ్రమల ప్రతినిధులతో ఆయన చర్చించారు. పరిశ్రమల భాగస్వామ్యంతో డ్రోన్ పరిశోధన స్టేషన్ ఏర్పాటు, విద్య, పరిశోధన, స్టార్టప్ మద్దతు, వ్యవసాయం, లాజిస్టిక్స్ తదితర వాటిపై మాట్లాడారు. పలు అంశాల గురించి వీఎస్‌యూతో ఎంఓయూ ప్రతిపాదనలు చేశారు. డ్రోన్ సాంకేతికతలో ఎంఎస్ ప్రోగ్రాం, పీజీ డిప్లొమో, వర్సిటీలో సైన్స్ ఎగ్జిబిషన్ లేక విమానయాన మ్యూజియం ఏర్పాటుకు నిధులు పొందడం, సీఎస్ఆర్ నిధులు, పథకాల ద్వారా నైపుణ్య అభివృద్ధి తదితర కార్యక్రమాలపై ప్రతిపాదనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆశలు పెట్టుకున్నాం.. పట్టించుకోలేదు

- నామినేటెడ్ పదవులను ప్రకటించిన ప్రభుత్వం
- టీడీపీ సీనియర్ల అసంతృప్తి

నెల్లూరు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం శనివారం నామినేటెడ్ పదవులను ప్రకటించింది. జిల్లాకు చెందిన పలువురికి అవకాశం దక్కగా చాలామంది సీనియర్లకు నిరాశే మిగిలింది. నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఏపీ ఎన్విరాన్మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, ఏపీ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా ఆనం వెంకటరమణారెడ్డి, ఏపీఎస్ఆర్టీసీ నెల్లూరు రీజనల్ బోర్డు చైర్మన్‌గా బీజేపీకి చెందిన సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి నియమితులయ్యారు. జిల్లాలోని ఆత్మకూరు, ఉదయగిరి, కావలి, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల పరిధిలోని కొందరు సీనియర్ టీడీపీ నేతలు పదవులు వస్తాయని ఆశలు పెట్టుకున్నారు. కానీ వీరికి అవకాశం దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తిగా ఉన్నట్లు తెలిసింది. ఎన్నికల్లో కష్టపడి పార్టీ కోసం పనిచేస్తే తమను పట్టించుకోలేదని నేతల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా లక్ష దీపోత్సవం

నెల్లూరు(బృందావనం): నెల్లూరులోని వీఆర్సీ మైదానంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్తీక మాస లక్ష దీపోత్సవంలో రెండోరోజైన శనివారం వివిధ పూజా కార్యక్రమాలు జరిగాయి. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు గో పూజ చేశారు. యాగశాలలో విశేష రుద్రహోమంలో వారు పాల్గొన్నారు. ప్రధాన వేదికపై తాత్కాలికంగా ప్రతిష్టించిన ఆంజనేయస్వామికి ప్రధాన అర్చకులు గట్టుపల్లి పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ఆకుపూజ చేశారు. కార్యక్రమంలో వేమిరెడ్డి కోటారెడ్డి, కమిటీ సభ్యులు కంజర్ల భాస్కరశర్మ, ఆమంచర్ల వెంకట ప్రభాకర్‌రావు, ఆశం విజయసారథి, గంధం సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. లక్ష దీపోత్సవం ఆదివారం ముగియనుంది.


పూజ నిర్వహిస్తున్న వేదపండితులు

ఇసుక పాలసీపై ప్రత్యేక శ్రద్ధ

- మంత్రి నారాయణ

నెల్లూరు(సెంట్రల్): ఇసుక పాలసీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు సరఫరా చేస్తామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. నెల్లూరు నగర పరిధిలోని పలు ఇసుక రీచ్‌లను మంత్రి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇసుక సరఫరాలో ఉన్న ఇబ్బందులను తొలగిస్తామన్నారు. అనంతరం ఆయన ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం సమీపంలో ఉన్న కాపు భవన్‌ను పరిశీలించారు. ఇక్కడ వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.


రీచ్‌ను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

ఇద్దరు యువకులపై రౌడీషీట్

నెల్లూరు(క్రైమ్): పదేపదే నేరాలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న మనుమసిద్ధినగర్‌కు చెందిన షేక్ జకీర్‌బాషా, డైకస్‌రోడ్డు సుభాష్ చంద్రబోస్ నగర్‌కు చెందిన షేక్ రబ్బానీపై నెల్లూరు చిన్నబజారు పోలీసులు శనివారం రౌడీషీట్ తెరిచారు. నిందితులపై వివిధ పోలీస్‌స్టేషన్లలో పలు కేసులున్నాయని స్థానిక ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు తెలిపారు. ప్రజాజీవనానికి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఆయన హెచ్చరించారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.45
సన్నవి : రూ.35
పండ్లు : రూ.20



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 119
లేయర్ (లైవ్)	: 110
బ్రాయిలర్ చికెన్	: 220
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 244
లేయర్ చికెన్	: 187

మూడు బైక్‌ల చోరీ

వెంకటాచలం: మండలంలోని చెముడుగుంట, కసుమూరు, మొలకలపూడి గ్రామాల్లో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మూడు మోటార్‌బైక్‌లను చోరీ చేశారు. బాధితులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.